# తుది నిర్ణయం

రచన : కాకాని కమల

"ఆదివారం సెలవు ఇచ్చిందెందుకు? పేకాట ఆడుకోమనా?" అంది జయ. పేకాటకి బయలు దేరబోతున్న భర్త "రాజు"ని వుద్దేశించి.

తలదువ్వుకుంటున్న రాజు ఓరగా భార్యకేసి చూశాడు.

"కాదు. పెళ్ళాం ఒళ్ళో పడుకుని కబుర్లు చెప్పుకోమని" అన్నాడు వ్యంగ్యంగా.

అతని హేళన జయ మనస్సుని సూటిగా తాకింది.

భోజనానికి నాకోసం చూడనవసరం లేదు .... అంటూ నిర్లక్ష్యంగా సైకిల్ ఎక్కి వెళ్ళిపోతున్న భర్తకేసి అచేతనంగా చూస్తూ నిల్చుండి పోయింది. భర్త రూపం క్రమంగా దూరమయికను మరుగయ్యింది. బరువుగా నిట్టూర్చింది జయలక్ష్మి.

"ఈ మధ్య బాగా మారిపోయాడు రాజు. మునుపటి వ్యక్తికాదు" రహస్యం చెప్పింది మనసు. దిగులుగా కూర్చుండి పోయింది జయ. భర్తలోని మార్పు ఆమెని కృంగదీస్తున్నది. మొదట్లో సరదాగా కాలక్షేపానికి అలవర్చుకున్న పేకాట ఇప్పుడు వదలలేనంతగా పట్టుకు పోయింది.

ఆ పిచ్చిలో వలచి వలపించుకున్న భార్య జయని కూడా నిర్లక్ష్యంతో తీసి పారేస్తున్నాడు. వర్కింగ్ డేస్ లోనే నయం. నాల్గు గంటలు యింటి పట్టున వుంటాడు. కాని ఆదివారం వచ్చిందంటే మరీ అధ్వాన్నంగా వుంటున్నది పరిస్థితి. అతని ప్రవర్తన దుస్సహనంగా వుంటున్నది జయకి. దాంతో భార్యాభర్తలిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. పోనీ అతను ఇంట్లోవున్న కాస్సేపూ అయినా అన్యోన్యంగా వుండటం పోయి కీచులాడుకోవటం, వాగ్వివాదాలతోటే గడుస్తున్నది కాలం. ఈ విధంగా ఒక 5,6 నెలల నుంచి సాగుతున్నది సంసారం.

జయకి జీవితం చాలా విసుగ్గా నిస్సారంగా కనుపిస్తోంది. ఇంకా కొన్ని రోజులు ఇటువంటి వంటరితనమే గడపవలసి వస్తే నిజంగా ఆమెకి పిచ్చి లేచేటట్లుంది పరిస్థితి. భర్త యింటికి

రాగానే ఆ అర్ధరాత్రిపూట నిశ్శబ్దంగా వున్న సమయంలో - సాధించటం ఆమె అభిమతం కాదు. కాని ఆమెకి తెలియ కుండానే ఏదో పైశాచిక శక్తి ఆమెలో అలా విజృంభిస్తోంది. ఒంటరి తనం ఆమెని నానాటికి రాక్షసిగ, విచక్షణా రహితంగా మార్చివేస్తోంది.

రెండు గదుల అద్దె ఇల్లు. ఇద్దరు మనుష్యులు. చెయ్యటానికైనా అస్త మానం ఏం పని వుంటుంది గనుక? తెగేదాకా లాగితే పర్యవసానం ఏమిటో ఆమెకి బాగా తెలుసు. అందుకే ఒక నిర్ణయానికి వచ్చింది. భర్తని ఇక సాధించ దల్చుకోలేదు. "నేను ఎత్తి చూపే కంటే ఆయన తప్పుని ఆయనే తెల్సుకునేలా చేస్తాను" అనుకుంది దృఢంగా.

* * *

పది రోజులున్నుంచి ఇల్లు ప్రశాం తంగా వుంటున్నది. రాజు అర్ధరాత్రి వచ్చినా కిమ్మనకుండా తలుపు తీస్తోంది జయ. భార్యలోని మార్పుకి ముందు విస్తుబోయినా "ఎన్నాళ్లు సాధిస్తుంది?" చచ్చినట్లు పడుంటుంది" అనుకున్నాడు గర్వంగా రాజు.

ఎప్పుడూ అర్ధరాత్రి అయితేగాని ఇల్లు జ్ఞాపకం రాని రాజు ఆ రోజు ఆఫీసునుంచి సరాసరి ఇంటికి వచ్చాడు. అతని పేకాట మిత్రులు కొందరు క్రికెట్ మాచ్ చూడటానికి వెళ్ళారు. "జయ" మీద దయ గలిగి అతను ఇంటికి వచ్చాడు. కాని అతను ఇంటికి వచ్చేసరికి తలుపుకి తాళం పెట్టి వుంది. ఎదురింటి ఆనందరావుగారి ఇంటికి వెళ్లినట్లు ప్రక్కవాటా ఆవిడ చెప్పగా అక్కడికి వెళ్లాడు. కాని అక్కడి దృశ్యం చూడ గానే రాజు స్థంభించి పొయ్యాడు!!....

—ఆయింటి యజమాని ఆనంద రావు, అతని భార్య, అతని ఇద్దరు తమ్ముళ్లు, జయ, ఇంకా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి! అంతా డ్రాయింగ్ రూమ్‌లో కుర్చీలు వేసుక్కూర్చుని పేకాట ఆడుతున్నారు. ముక్కలువెయ్య టానికి వీలుగా మధ్యలో టీపాయిని అమర్చారు. అందరి చేతుల్లోనూ విసన కర్రల్లా అమర్చుకున్న పేకముక్కలు వున్నాయి. ఆట మంచి పట్టులోనున్నట్లు వారి ముఖకవళికలు సూచిస్తున్నాయి. రాజు వెళ్ళేసరికి ఆనందరావు జయకేసి చూసి నవ్వుతూ ఏదో అంటున్నాడు. జయ ఒంగి ముక్క వేస్తున్నది. అట్లా ఒంగినప్పుడు ఆమె పయిట కొద్దిగా భుజం మీంచి పక్కకి జారింది. బరు వైనజడ గుండ్రని భుజం మీదుగా ముందుకి వాలి వుంది.

రాజుని చూసి ఆనందరావు "ఆట"కి ఆహ్వానించాడు.

"లేదండి బాగా తలనొప్పిగావుంది" అని తప్పించుకున్నాడు.

ఆ కొద్ది నిమిషాల్లోనే ఆనందరావు



జయ అటని ప్రస్తావిస్తూ ఆమెని ప్రశంశించాడు. జయ ముక్కాలుపెట్టేసి ఇంటికి బయలుదేరింది. మౌనంగా అనుసరించాడు రాజు.

ఇంట్లోకి రాగానే రాజు భార్యనివేసిన మొదటి ప్రశ్న:

"నువ్వు అక్కడ చేస్తున్న పనేమిటి?"

"కనుపించటంలే! మీరుచేసే పనే నేను చేస్త."

"నీకూ నాకూ పోలికేమిటి? నువ్వు ఆడదానివి, నేను మగాడ్ని"—

"నేను ఆడేచోట మీలాంటి మగవాళ్లు వున్నారు. నాలాంటి ఆడవాళ్ళూ

వున్నారు" జయ నిర్లక్ష్యపు సమాధానం, దాంతో రాజు కళ్ళు క్రోధంతో చింత నిప్పులు కురిపించాయి.

"అయితే నన్ను ఎదురించి నాకిష్టం లేని పనిచేసి ఇంకా నా ఇంట్లో వుండ గలననేనా నీ అభిప్రాయం ?

"కాదు." అంది దృఢంగా జయ లక్ష్మి.

నాకిష్టంలేని పని మీరు చేస్తున్నా నేను సహిస్తున్నాను.

కాని మీ కిష్టంలేని పని నేను చేస్తే, సహించే శక్తి మీకు లేకపోతే చెప్పండి. ఇప్పుడే ఇంట్లోంచి వెళ్ళిపోతాను. శాశ్వతంగా మీకు అడ్డు తొలగిపోతాను" అంది.

"ఒహో .... అయితే అంతవరకు వచ్చిందన్నమాట ! బెదిరిస్తున్నావా ?" అన్నాడు.

మెరుపు కొట్టినట్లు చూసింది జయ. "హం ...ఇది బెదిరింపా ? చల్లని భర్త నీడ లేకుండా చేసుకోవటం, భర్త అండ దండలు లేకుండా చేసుకోవటం, నా బ్రతుకు నేనే పాడుపెట్టుకుంటాననటం బెదిరింపు అవుతుందా? ఇతరుల బ్రతుకు నాశనం చేస్తాననటం బెదిరింపు అవుతుంది కాని తన బ్రతుకు తనేపాడుచేసుకోవటం బెదిరింపు ఎలా అవుతుంది ?" అన్నది వేదనగా.

"ఆ మాత్రం తెలుసున్న దానివి ఇలాగేనా ప్రవర్తించేది ? నేను పేకాట ఆడానని నువ్వూ ఆడతావా ? అయితే నాతో నీకు వంతా ?" అన్నాడు అసహనంగా.

"కాదు. కాని అంతకంటే గత్యంతరం మటుకు ఏమిటి ? మీకు నాతో సరదాగా వుండటానికి టైము చిక్కదు. నాకు పలకరించేవారు లేక, చదువుకుందుకు ఓ చిన్న పుస్తకమయినా ఇంట్లో లేక కాలం గడవదు. నేను పత్రికలు, నవలలు చదివితే మీ దృష్టిలో చెడిపోతాను. చదివినందువల్ల నాలో స్వతంత్ర భావాలు వస్తాయని మీ భయం. కాని ఇప్పుడు ఏ పుస్తకం చదివితే నాలో ఇటువంటి భావాలు వచ్చాయి ? ఏ సినిమాలు చూస్తే నాలో ఈ ధైర్యం అలవడింది? ఓ స్నేహితులు లేక, చదువుకుందుకు ఓ పుస్తకం లేక, మాట్లాడే దిక్కులేక ఈ నాల్గు గోడల మధ్య నలిగి చావమనా మీ అభిప్రాయం. మనిషి చెడిపోయినా బాగుపడినా చాలావరకు పరిస్థితుల ప్రభావమే.

"మీ రాడిన పేకాటే నేనూ ఆడాను. అది తప్పెలా అవుతుంది ? మీ రూ మనిషి. నేనూ మనిషి.ఇద్దరిలోనూ మనసుంది. ఆ మానసిక ఆనందంకోసం మీరు చేసిన పనే నేనూ చేశాను. అది తప్పెలా అవుతుంది ? మిసెస్ ఆనంద రావు ఎన్నాళ్ళనుంచో నన్ను పిలుస్తోంది. ఒంటరిగా ఎంతసేపని అలా కూర్చుంటారు ? మా యింటికి రండి. సరదాగా

కాలం గడుస్తుందని రోజా అంటుంది. ఇన్నాళ్ళకి ధైర్యంచేసి వెళ్ళాను. ఒక వారం పది రోజులుగ నాకు చక్కగా కాలం గడుస్తుంది. మీరు నాతో సఖ్యతగ వున్ననాడు, నాతో సరదాగా వున్ననాడు నాకు వేరే కాలక్షేపం ఎందుకు? కాని పాపం మీకు అందుకు తీరిక లేదు భార్యతో మాట్లాడటానికి తీరికలేని మనిషికి పేకాడటానికి కావలసినంత టైము. భార్యకి సినిమా చూపించటానికి డబ్బు లేని మనిషికి పేకాటకి డబ్బుంటుంది. ఇల్లాలితో కాస్సేపు ముచ్చటించటానికి విసుగేసే మనిషికి తెలవార్లూ పేకాడటానికిమాత్రం విసుగుండదు. ఇదెక్కడి న్యాయం? ఇదెక్కడి చోద్యం?

మూర్ఖంగా ప్రవర్తించకపోతే మన సుగ్న మనిషిగా మీ రెందుకు ఆలోచించరు? కావాలని నన్ను పెళ్ళి చేసుకున్నారు. నా వాళ్ళందర్ని ఒదులుకుని మిమ్మల్ని నమ్మి వచ్చినందుకు మీరు నాకు ఒరగబెట్టిం దేమిటి? ఈ ఇంటికి ఏం చూసుకుని వచ్చాననుకున్నారు? 300రూ॥లు తెచ్చే మీ వుద్యోగంచూశా? మీ బి.ఏ. చూచా? ఏది తక్కువయినా ఆపేక్షకికొరతవుండదని నమ్మివచ్చాను. కానిఅందుకునాకు లభించిందేమిటిక్కడ? మిమ్మల్ని కట్టుకుని నేను బావుకున్న దేమిటి? ఆకలిబాధ భరించలేక అన్నం తినవలసి వస్తున్నది. వేరే దిక్కులేక మీ పంచన వుండటం అవుతున్నది. కాని ఇంక ఇది సాగదు.

చివరి సారిగ ఒక్క మాట చెప్తున్నాను వినండి. నాకు ఒక్కపూట తిండిలేక పోయినా భరిస్తాను. చీరలు చిరిగితే కుట్టుకుని తొడుక్కుంటాను. కాని మీ అప్యాయత కొరవడితే మాత్రం భరించలేను. మీ వ్యసనాలను మాత్రం సహించలేను. వున్నంతలో ఆప్యాయంగా, అనురాగంతో గడిపే జీవితమేనాకుకావాలి. ఇందులోనిర్బంధం ఏమీ లేదు. మీకు నేనుకావాలనుకుంటేఆపేకాట స్నేహితుల్ని ఒదులుకోండి. అలా కాక ఆ పేకాటే ముఖ్య మనుకుంటే రేపు వుదయం బండికి నన్ను పంపించి వెయ్యండి మీ ఇష్టం. ఇందులో నిర్బంధము ఏమీలేదు. మీకు ఏది ఎక్కువ ప్రీతి కరమనిపిస్తే... మీకు ఏది ఎక్కువ సంతోష దాయక మనిపిస్తే ఆ పని చేయండి. కాని అప్పటికయ్యేది ప్రస్తుత మన్నట్లు అయితే మాత్రం నేను సహించను. మీరు పై రెండింటిలో ఏదో ఒకటి శాశ్వతంగా ఒదులుకోక తప్పదు." అంటూ విసురుగా లోపలికి వెళ్ళి మంచం మీద వాలింది. అప్పటికే కన్నీళ్ళు జలజలా రాలి చెంపల్ని తడుపుతున్నవి. వెక్కిళ్ళతో తలగడలో తల దూర్చుకున్నది జయ.

* * *

భార్య అంత తీవ్రంగా ప్రతిఘటిస్తుందని వూహించని "రాజు" నివ్వెర

పోయాడు. అశాంతిగ తలపట్టుకుని కుర్చీలో జార్లబడ్డాడు.

అసలతనికీ మధ్య జీవితంలో శాంతి కొరవడింది. ఇంటికొస్తే అనాదరణ, తగాదాల మూలాన్న భార్య ప్రేమామృతాన్ని చవిచూడ లేక పోతున్నాడు. బయట స్నేహితుల మధ్య వున్నంత సేపూ బాగానే వుంటుంది. పేకాట ఆడినంత సేపూ సర్వం మరిచి పోవచ్చు. కాని అందులో చాలా నష్టపోతున్నాడు.

వచ్చే జీతంకాక కేవలం పేకాట నష్టాన్ని భర్తీ చెయ్యటానికి అదనంగా అప్పులు కూడా చెయ్యవలసి వస్తున్నది. దాంతో బయట, ఇంట కూడా అశాంతి, అనాదరణల మధ్య నలిగిపోతున్నాడు. రెండు నెల్లనుంచి ఇంటికిరాయి బకాయి పెట్టాడు. అవునుమరి. జయ అన్నదంటే అనదూ?వ్యసనాలకి బానిసై బలహీనుడై పోతున్నాడు. పైగా పోగొట్టుకున్న డబ్బంతా మళ్ళీ ఎలాగయినా ఆ పేకాడే సంపాదించాలన్న మూర్ఖపు పట్టుదలతో జీవితాన్నే పణంగా పెడుతున్నాడు. కాని ఆ విధంగా పది రూపాయలు సంపాదించినా ఇంకొకడు నష్టపోతే వచ్చేవేగా, నిజమే!...జయ పట్ల ఈ మధ్య మరీ కర్కశంగా వుంటున్నాడు. జయ కోసం పావలా మల్లెపూలు తెచ్చి ఎన్నాళ్ళయింది? సరదాగా ఆమెతో కలిసి భోంచేసి ఎన్ని రోజులయింది? అనుకున్నాడు. "మగవాడిలో లోపం వున్నప్పుడే ఆడది ఎదురుతిరగడం సంభవిస్తుంది" అన్న సత్యం అతనికి బోధపడింది.

ఇంతకుముందు జయ తను ఎంత ఆనందంగా వుండేవారు? తను పెద్దగ సంపాదన లేదని, ఆస్తిలేదనిజయతండ్రి తమ పెళ్ళికి ఒప్పుకోలేదు. కాని జయ పట్టుదలవల్ల తమ వివాహం జరిగింది. కాని అందుకు జయకి తానిచ్చిన ప్రతిఫలమేమిటి? నిరాదరణ! ఛ....ఛ.... వెధవ పేకాటకోసం కట్టుకున్న ఇల్లాల్ని వుసురుపెట్టేటంతటి భ్రష్టుడ్ని ఎప్పుడు అయ్యాను? నాతోపాటు చాలా మంది క్లబ్బులో ఆడతారు. కాని వాళ్ళ భార్యలందరూ జయలానే పేకాట ఆడారా? జయ ఎందుకిలా చేసింది? ఆ ఆనందరావు ఎటువంటివాడు? మంచివాడా, చెడ్డవాడా? ఎంత భార్యపక్కన వుంటే మాత్రం వాడి దృష్టి జయ మీద పడకూండా వుంటుందా? నక్కచూపులూ వాడూనూ। అయినా జయ ఎందుకిలా చేసింది? ఎందుకిలా చేసింది? అనుకున్నాడు అసహనంగా. ఆనందరావు నవ్వుతూ జయకేసి చూట్టం, జయ వంగి ముక్క వెయ్యటమే అతని మనోనేత్రం ముందు మెదుల్తున్నది. ఆ వేదనతో అశాంతిగతల విదుల్చుకున్నాడు ఆవిధంగాఅతను గంటన్నరసేపు ఆలోచన్లతో సతమతమయ్యాడు. చివరికి ఒక నిశ్చితమైన

అభిప్రాయానికి వచ్చాడు.

* * *

భార్యాభర్త లిరువురూ అన్యమనస్కంగా వుండటంతో లైటు ఎవ్వరూ వెయ్యలేదు. ఇల్లంతా చీకటిచీకటిగ వుంది. రాజు లేచి స్విచ్ వేశాడు. అల్మారా తలుపు తెరిచి పేకలన్నిదొత్తు పెట్టాడు. నెమ్మదిగా జయ గదిలోకి వెళ్ళాడు.

జయ భర్త రాకని గాజు కళ్ళతో స్తబ్ధంగా చూస్తున్నది. ఆప్యాయంగా ఆమె భుజంపై చెయ్యివేసి "జయా! నన్ను క్షమించు. ఇన్నాళ్ళు ఆ పేక ప్రలోభంలోపడి మూర్ఖుడ్ని అయ్యాను. కాని ఆ పేక కోసం నిన్ను వదులుకునేటంత మూర్ఖుడ్ని మాత్రం ఇంకా కాలేదు అంటూ ఆ మూడు పేక సెట్లని జయ చూస్తూ వుండగా ముక్కలుగా చించి గదిలో మధ్యగా కుప్పపోశాడు. నెమ్మదిగా జయని లేవదీసి భుజం వత్తిపట్టి నడుంచుట్టూ చెయ్యివేసి అక్కడికి నడిపించుకుని వెళ్ళాడు. జేబులోంచి అగ్గిపెట్టె తీసి భార్య చేతికి ఇచ్చాడు.

"జయా! ఇవి ఇప్పుడే ఇక్కడే నీ చేతోనే నిర్మూలించు.

"ఈ మంటతో మన మనసుల్లో కమ్మిన చీకట్లు తొలగి వెలుగు నిండాలి" అన్నాడు.

"ఈ నాలుగు సెట్లు కాలితే మాత్రమేం? ఇంకా బయట చాలా పేకలున్నాయి" అంది జయ.

"బయట వుండచ్చు జయా! కాని మన యింట్లోమాత్రం వుండవు" అన్నాడు రాజు దృఢంగా. జయకళ్ళు ఆనందంతో కళకళలాడాయి. రాజు జయని రెండుచేతులా పొదివి పట్టుకున్నాడు. జయ సుతారంగా అగ్గిపుల్ల గీసి పేకకి నిప్పుపెట్టింది. డైమన్ రాజు, ఇస్పేటు ఆసు, జాకీ, మణేళా...అన్నీ తగులబడి పోతున్నాయి. భర్త మొఖం ఎలాగుందోనని ప్రక్కకి తిరిగిచూసింది. అతని కళ్ళు విజయ గర్వంతో నవ్వుతున్నాయి.

"చూశావా? నువ్వంటే నాకెంత ప్రేమో!" అన్నట్లు చూస్తున్నాయి.

మధురంగా నవ్వుతూ తలవంచుకున్నది జయ. పేకముక్కలు రాజుకుని వెలుగు ప్రజ్వలిస్తుంటే ఇరువురి గుండెల్లోని బరువూ క్రమంగా దిగిపోయింది.

రాజు తుది నిర్ణయం జయని ఆనంద లోకాలకి తీసుకుని వెళ్ళింది.

## మనసుంగిసిన పిక్చర్

దువ్వ సుభద్రాదేవి.

జగమంతా నిండిన ప్రాణవాయువు
నీ చైతన్యమని తెలుసు
అందుకే
నీలో చైతన్యంలాంటిదే కరువై
ఆ రోజుకు ఋణం తీరిన
విగత దేహాలమీద కప్పిన
ఒక్కొక్క ధవళవస్త్రమూ
శతాధిక అనుబంధాలను
ప్రతి ఫలిస్తోంది
చెదరిన మెతుకుల తెల్లదనాన్ని
ఎవరు తినగలరమ్మా
ఎవరు భరించగలరని ఈ విషాదం